





శాంథోమ్ ప్రైవేటు స్కూలులో 'నలంకాక్కుమ్ స్టాలిన్' వైద్యశిబిరాల పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రోగులు అనొద్దు.. వారు వైద్య లబ్ధిదారులు

- వైద్యులకు సీఎం స్టాలిన్ హితవు
- 'నలంకాక్కుమ్ స్టాలిన్' వైద్యశిబిరాల ప్రారంభం

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యులు, ఆసుపత్రుల వద్దకు చికిత్సల కోసం వచ్చేవారిని రోగులని పిలువకుండా వైద్యపరమైన లబ్ధిదారులుగా భావించి నాణ్యమైన వైద్యసేవలందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వైద్యులకు హితవు పలికారు. రాష్ట్రవ్యాప్తంగా 'నలంకాక్కుమ్ స్టాలిన్' పేరుతో ఉచిత వైద్యపరీక్షల శిబిరాలను శనివారం ఉదయం శాంథోమ్ సెయింట్ బీడ్స్ ఆంగ్లో ఇండియన్ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగిస్తూ కొద్ది రోజులకు ముందు స్వల్ప అస్వస్థతకు గురై ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుని పదిరోజులపాటు విశ్రాంతి తీసుకుని ఇటీవలే సచివాలయానికి వెళ్ళి సీఎంగా తన బాధ్యతలను మళ్ళీ ప్రారంభించానని, ఈ వైద్యశిబిరాల పథకాన్ని సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించమని అధికారులు సలహా ఇచ్చారని, అయితే ప్రజలను నేరుగా కలుసుకుంటే తన మనస్సు చాలా సంతోషిస్తుందని చెప్పి, ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నానని తెలిపారు. నాలుగేళ్లకు ముందు తాను సీఎం పదవిని చేపట్టినప్పుడు రెండో విడత కరోనా ఉగ్రరూపం దాల్చిందని, ఆ సమయంలో రెండు విడతలుగా ప్రజలకు రూ.4వేల చొప్పున ఆర్థిక సహాయం అందించానని, మంత్రులందరూ ఆరోగ్యశాఖ మంత్రులుగా అన్ని జిల్లాల్లో సేవలందించారని, వ్యాక్సిన్‌లు వేయించారని చెప్పారు. ప్రస్తుతం ఈ వైద్యశిబిరాలు కూడా సమర్థవంతంగా నిర్వహించేందుకు మంత్రులంతా మరోమారు ఆరోగ్యశాఖ మంత్రులుగా మారాలని స్టాలిన్ చమత్కరించారు. రూ.12.78 కోట్ల వ్యయంతో 1256 వైద్యశిబిరాలను నిర్వహించనున్నామని, ప్రతి శనివారం నిర్వహించే ఈ శిబిరాలకు ఒక్కో శిబిరానికి రూ.1,08,173లను ఖర్చు చేయనున్నామని స్టాలిన్ వివరించారు. ఈ శిబిరాలలో 40 యేళ్లకు పైబడినవారికి మధుమేహం, రక్తపీడనం, గుండెజబ్బులతో బాధపడుతున్నవారికి, గర్భిణులకు నాణ్యమైన వైద్యపరీక్షలు జరిపి సాయంత్రంలోగా ఫలితాలను అందజేస్తామన్నారు. ప్రతి జిల్లాలోనూ ప్రతి శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్యపరీక్షల శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. అనువైన పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలలో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ శిబిరాలలో బ్లడ్ టెస్ట్, ఈసీజీ, ఎకో, ఎక్స్‌రే, స్కాన్ పరీక్షలు జరుపుతామన్నారు. ప్రతి శిబిరంలోనూ వైద్యనిపుణులు, సుమారు 200 మంది వైద్య సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, శాసనసభ్యుడు డి.వేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై వాగ్వాదానికి దిగిన ఎంపీ తంగ తమిళ్ సెల్వన్, ఎమ్మెల్యేలను సమాధానపరుస్తున్న కలెక్టర్

బ్యానర్ తెచ్చిన తంటా

డీఎంకే ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య తేని జిల్లాలో వివాదం

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి సమీపంలో ఉన్న చక్కంపట్టిలో శనివారం ప్రభుత్వం తరుపున నిర్వహించిన కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేసిన బ్యానర్‌లో తన ఫోటో లేకపోవడంతో ఆగ్రహించిన డీఎంకే ఎంపీ తంగ తమిళ్ సెల్వన్ ఆండిపట్టి ఎమ్మెల్యే మహరాజన్‌తో వాగ్వివాదానికి దిగిన సంఘటన జిల్లా అధికారులను, అధికార పార్టీ శ్రేణులను కలవరపరిచింది. రాష్ట్ర ఆరోగ్య వైద్యశాఖ ఆధ్వర్యంలో 38 జిల్లాల్లో 'నలంకాక్కుం స్టాలిన్' వైద్య శిబిరాలు నిర్వహించే పథకానికి ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం నగరంలో శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత అన్ని జిల్లాల్లోని కలెక్టర్ల అధ్యక్షతన ఈ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఆ ప్రకారం తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోవున్న చక్కంపట్టి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన వైద్యశిబిరానికి జిల్లా కలెక్టర్ రంజీత్ సింగ్ సారథ్యం వహించారు. ఇందులో ఆండిపట్టి డీఎంకే ఎమ్మెల్యే మహరాజన్, తేని డీఎంకే ఎంపీ తంగ తమిళ్ సెల్వన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ముందుగా వేదికపైకి వెళ్లిన ఎంపీ తంగ తమిళ్ సెల్వన్ ఆహ్వాన బ్యానర్‌లో ప్రోటోకాల్ ప్రకారం ఉండాల్సిన తన ఫోటో లేదని, కలెక్టర్‌ను కోపగించుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఎంపీ చేతుల్లో ఉన్న సంక్షేమ పథకం గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే మహరాజన్ లాక్కుని తానే పంపిణీ చేస్తానని చెప్పడంతో వారిమధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒకరినొకరు ఏకవచనంతో దూషించుకోవడంతో సభలో గందరగోళం అలుముకుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ వేదికపై కలెక్టర్ సమక్షంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు దుర్భాషలాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

ఉత్తిరమేరూరు డీఎంకే నిర్వాహకులతో స్టాలిన్ భేటీ

- నియోజకవర్గంపై సమీక్ష
- క్షేత్రస్థాయి కేడర్ పని తీరుపై ఆరా

అడయార్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ఉత్తిరమేరూరు నియోజకవర్గ పార్టీ నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో నియోజకవర్గంలో పార్టీ పురోగతితో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 234 అసెంబ్లీ స్థానాలకు గాను 200 సీట్లలో గెలుపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. 'ఉడన్ పిరప్పే' అనే పేరుతో డీఎంకే అధ్యక్షుడి హోదాలో పార్టీ నిర్వాహకులతో సీఎం స్టాలిన్ వన్ టు వన్ (ముఖాముఖి) కార్యక్రమాన్ని గత జూన్ నెల 13వ తేదీన ప్రారంభించారు. ప్రతి రోజూ మూడు నియోజకవర్గాల నిర్వాహకులతో ఆయన ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు మొత్తం 13 రోజుల పాటు ఈ తరహా సమావేశాలు నిర్వహించగా, 39 నియోజకవర్గాల సమీక్షను పూర్తి చేశారు. నియోజకవర్గంలో పార్టీకి చెందిన అన్ని విభాగాలకు చెందిన ముఖ్య నిర్వాహకులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారు. వీరివద్ద అసెంబ్లీ సెగ్మెంట్‌లో పార్టీ అభివృద్ధి, క్షేత్రస్థాయిలో కార్యకర్తల పనితీరును ప్రధానంగా అడిగి తెలుసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకే కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిస్తున్నారు. ఇంతలోనే ఆయన ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఈ సమీక్షా సమావేశాలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఆయన కోలుకోవడంతో తిరిగి శనివారం నుంచి ప్రారంభించారు. స్థానిక తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయమైన అరివాలయంలో ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో ఉత్తిరమేరూరు సెగ్మెంట్‌కు చెందిన ముఖ్యనేతలతో పాటు అన్ని విభాగాలకు చెందిన నిర్వాహకులు పాల్గొన్నారు. గత ఎన్నికల్లో కంటే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి కూటమి 200 స్థానాల్లో ఘన విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.



ఉత్తిరమేరూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జితో చర్చలు జరుపుతున్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

అభిమానుల్లో వుండే ఎనర్జీ నాలోనూ వుంది

- 'కూలీ' ట్రైలర్ రిలీజ్ వేడుకలో రజనీకాంత్



చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అభిమానుల్లో ఉండే ఎనర్జీ తనలోనూ ఉందని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. ఆయన హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందిన 'కూలీ' చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక శనివారం రాత్రి చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాకు, సత్యరాజ్‌కు అభిప్రాయభేధాలుండొచ్చు, కానీ ఆయన మనసులో వచ్చిన మాటను నిర్మొహమాటంగా చెప్పి వెళ్లిపోతుంటారు. మనసులో ఉన్నది ఉన్నట్టుగా చెప్పేవారిని నమ్మొచ్చు. కానీ, మనసులో ఒకటి, బయట ఒకటి పెట్టుకుని వుండేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మకూడదు' అన్నారు. 'ఎన్ని రోజులని నేను మంచిగా నటించాలి' అని హీరో అజిత్ కుమార్‌కు దర్శకుడు వెంకట్ ప్రభు ఒక డైలాగ్ రాశాడు. ఆ విధంగానే ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున ఒక పాత్రలో నటించారు' అని రజనీకాంత్ అన్నారు.అనంతరం అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, 'ఒక కూలీ వంద బాషాలకు సమానం. నిజమైన సూపర్‌స్టార్ రజనీకాంత్. ఓజీ సూపర్‌స్టార్ అంటే రజనీకాంత్. యూ ఆర్ ది సూపర్ స్టార్ ఆఫ్ ది ఇండియన్ సినిమా' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. దర్శకుడు లోకేష్ కనకరాజ్ మాట్లాడుతూ, 'నా తండ్రి ఒక బస్సు కండక్టర్. ఆయన నంబరు 1421. ఆ నెంబరును ఈ సినిమాలో రజనీకాంత్‌కు ఉపయోగించాను. ఇది నా తండ్రికి నేను ఇచ్చే ఒక గౌరవంగా భావిస్తున్నా' అన్నారు.హీరోయిన్ శృతి హాసన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నాకు ఒక మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు లోకేశ్‌కు ధన్యవాదాలు. మా నాన్నకు 'విక్రమ్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీని ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఆ చిత్రం నుంచి నేను మీ అభిమానిగా మారిపోయాను' అన్నారు. ఈ ఆడియో వేడుకల్లో బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14వ తేదీన తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్‌కానుంది.

ఫ్యాన్స్ అత్యుత్సాహం.. స్వల్ప తోపులాట : 'కూలీ' ఆడియో రిలీజ్ వేడుక జరిగిన నెహ్రూ ఇండోర్ స్టేడియం వద్ద రజనీకాంత్ అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు.వేడుకను తిలకించేందుకు పాసులున్నవారిని మాత్రమే అనుమతించారు. అయితే, పెద్ద ఎత్తున ఫ్యాన్స్ స్టేడియం వద్దకు చేరుకుని లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఒక దశలో అభిమానులంతా ఒక్కసారిగా ముందుకు తోసుకు వెళ్లడంతో స్వల్ప తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఓ మహిళా కానిస్టేబుల్ కూడా కిందపడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. పరిస్థితిని చక్కదిద్దారు.

మదురైలో టీవీకే మహానాడుకు భారీ ఏర్పాట్లు



పందిరి నిర్మాణ పనుల్లో కార్మికులు



సభా వేదికను నిర్మిస్తున్న కార్మికులు

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఇక కొద్ది మాసాల గడువుండటంతో అన్ని రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నాయి. నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) కూడా మహానాడు పేరుతో ఓటర్లను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఆ మేరకు మదురైలో పార్టీ ద్వితీయ మహానాడును నిర్వహించనుంది. ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు విజయ్ బూత్‌కమిటీ ఇన్‌ఛార్జీల సమావేశాలు, సభ్యత్వ నమోదుకు కొత్త యాప్‌ల ఆవిష్కరణ సభలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలలో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ మినహా తక్కిన భావసారూప్యత కలిగిన పార్టీలను కలుపుకుని మెగా కూటమిని ఏర్పాటు చేయాలని ఆయన భావిస్తున్నారు. ఆ మేరకే పార్టీ సత్తాను చాటేందుకు మదురైలో ఈ నెల 25న పార్టీ ద్వితీయ మహానాడును నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ మహానాడు నిర్వహణకోసం గత జూలై 16న పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మదురై వెళ్ళి భూమి పూజలు నిర్వహించారు. అక్కడ భారీ పందిరి నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. మహానాడుకు అనుమతించమంటూ మదురై మహానగర పోలీసు కమిషనరేట్‌లో వినతి పత్రం కూడా సమర్పించారు. ఈ పరిస్థితులలో గత రెండు రోజులుగా మహానాడు పందిరి, వేదిక తదితర నిర్మాణాలకు సంబంధించిన పరికరాలను స్వాగత తోరణాలను కంటైనర్ లారీలలో మహానాడు ప్రాంతానికి తరలిస్తున్నారు. మహానాడుకు ఇంకా 23 రోజులు ఉన్నప్పటికీ పందిరి నిర్మాణ పనులు, వేదిక నిర్మాణపనులు శనివారం నుండి చురుకుగా సాగుతున్నాయి. ఈ మహానాడుకు సుమారు 20 లక్షల మందిని తరలించాలని పార్టీ నాయకులు నిర్ణయించారు. అందుకు తగినట్లు 506 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ స్థలంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. ప్రస్తుతం 20 ప్రొక్లయిన్ యంత్రాలతో నేలను చదును చేసే పనులు కూడా జరుగుతున్నాయి. సభా వేదిక ముందువైపున జనం మధ్య పార్టీ నేత విజయ్ నడిచివెళ్లేలా ప్రత్యేకంగా ఎత్తయిన కాలినడక దారిని కూడా నిర్మిస్తున్నారు. సుమారు 100 మంది కార్మికులు అక్కడే గుడారాలు వేసుకుని నివసిస్తూ మహానాడు నిర్మాణ పనులు చేస్తున్నారు. రెండు రోజులకు ముందు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మహానాడు వేదిక, పందిరి నిర్మాణ పనులను పరిశీలించారు.

నా ఫొటో వాడొద్దు...

ఇదిలా ఉండగా టీవీకే పార్టీ కార్యక్రమాలు, సభలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లలో తన ఫొటోను వాడకూడదంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ శనివారం సాయంత్రం ఓ ప్రకటన జారీ చేశారు. పార్టీకి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లలో పార్టీ అధినేత విజయ్ ఫొటోలే ముద్రించాలని, తన ఫొటోను వాడితే పార్టీపరంగా కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

భక్తిపరులే ధర్మాత్ములవుతారు!



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న తెలుగు ప్రముఖులు

- 'ప్రవచన సార్వభౌమ' చాగంటి కోటేశ్వరరావు



సభకు హాజరైన శ్రోతలు

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో ధర్మచింతన, సేవాభావం కలిగినవారే ధర్మాత్ములుగా కీర్తి పొందుతారని ప్రవచన సార్వభౌమ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అభివర్ణించారు. భారతీయతా వాహిని చెన్నై ఆధ్వర్యంలో చాగంటి కోటేశ్వరరావు 'భక్తి - ముక్తి' అనే అంశంపై రెండ్రోజుల ప్రవచన కార్యక్రమం శనివారం సాయంత్రం 6.15 గంటలకు స్థానిక చెట్‌పట్‌లోని కుశలాంబాళ్ కళ్యాణమహల్‌లో ప్రారంభమైంది. టీటీడీ చెన్నై వేదపండితుల వేదాశ్వీరచనాల మధ్య భారతీయతా వాహిని చెన్నై విభాగం తరఫున పీవీఆర్ కృష్ణారావు, అజంతా కనిగెలుపుల శంకరరావు, టీటీడీ చెన్నై సలహామండలి మాజీ అధ్యక్షుడు నూతలపాటి శ్రీకృష్ణ, ఆనందకుమార్‌రెడ్డి తదితర ప్రముఖులు చాగంటిని సంప్రదాయబద్ధంగా శాలువలు, పూలమాలలు, రుద్రాక్షమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తన తొలి రోజు ప్రవచన కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు 'భక్తి - ముక్తి' అనే అంశంపై ప్రసంగించారు. తాళ్లపాక అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు తదితర మహానుభావులు భక్తి మార్గాన్నే అవలంబించి ముక్తి మార్గం పొందారని, శక్తి సాధన ద్వారా ముక్తి పొందవచ్చునని అన్నారు. భక్తి, ముక్తి మార్గాలలో చేసే ప్రయాణం ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా సాగుతుందని పేర్కొన్నారు. మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, భగవద్భక్తి అనేవి ప్రేమకు నిదర్శనాలని, భక్తి, భగవంతుడు, భక్తుడు ఈ మూడు సుగుణాలు కలిగినవారు భగవంతుడి సేవలో పరమానందం పొందుతారని వివరించారు. భగవంతుడిని సేవించడం మహాభాగ్యమని, ఈశ్వరుడి అనుగ్రహం వల్ల మాత్రమే మోక్షం సిద్ధిస్తుందని అన్నారు. ఈ కలియుగంలో భక్తి మంచి గుణాలుగా మారాలని, భక్తిపరులే ధర్మాత్ములవుతారని అన్నారు. చదువుకున్నంత మాత్రాన ధర్మాత్ములు కాలేరని, ఆచారం నుండే ధర్మం ఉద్భవిస్తుందని ఆయన సూచించారు. పురాణాలు, శిష్టాచారం, అంతరాత్మ ప్రమాణాలు, శ్రుతి అనే ఐదు అంశాలు కలిగి ఉన్నవారు భగవంతునికి ప్రీతిపాత్రులవుతారని, భక్తి తత్త్వాలు నవవిధాలని, మనిషి కదలికలు ధర్మవిరుద్ధంగా ఉండకూడదని హితవు పలికారు. భగవద్గీత పఠనం వల్ల గుణాల సారాంశ ప్రభావం తెలుసుకోవచ్చునని, శరీరాన్ని, మనస్సును పరిశుద్ధంగా ఉంచుకుని, మంచి సంకల్పంతో సమాజంలో ముందుకు సాగాలని చాగంటి పిలుపునిచ్చారు. భక్తిమార్గంలో ఉన్నంత కాలం భగవంతుడితో కలిసి పయనించే అనుభూతి పొందవచ్చునని, ఇందుకు సాధన అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ప్రముఖులు పి.రవీంద్రకుమార్‌రెడ్డి, ఊరా లక్ష్మీనరసింహారావు, ఊటుకూరు శరత్‌కుమార్, మన్నారు ఉదయకుమార్ సహా పెద్ద సంఖ్యలో నగరం, శివారు ప్రాంతాలకు చెందిన తెలుగువారు హాజరయ్యారు. చివరగా అందరికీ అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

సమాచార దృష్టి

యోగా కోర్సుల దరఖాస్తు సమర్పణ గడువు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యోగా, ప్రకృతి వైద్య కోర్సుల దరఖాస్తు సమర్పణ గడువు పొడిగించారు. భారత వైద్యం మరియు హోమియోపతి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలల్లో 160 సీట్లు, 17 ప్రైవేటు కళాశాలల్లో 1,760 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లలో విద్యార్థుల అడ్మిషన్ల దరఖాస్తు స్వీకరణ www.tnhealth.tn.gov.in, www. tnayushselection.org అనే వెబ్‌సైట్‌లలో సోమవారంతో ముగియగా, 3,750 మంది దరఖాస్తులు సమర్పించారు. విద్యార్థుల కోరిక మేరకు దరఖాస్తు సమర్పణ గడువు ఈ నెల 8వ తేది సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారు.

'మద్రాస్ డే' సందర్భంగా క్విజ్ పోటీలు

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): 'మద్రాస్ డే' పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు ఈ నెల 9వ తేదీన క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. 'ది మెడ్రాస్ డే' సంస్థ ఆధ్వర్యంలో తమిళ భాషలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతి ఏడాది చెన్నై డే సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహిస్తుంటారు. స్థానిక మైలాపూర్ లజ్ సమీపంలో ఉన్న రణడే లైబ్రరీ ప్రాంగణంలోని శాస్త్రి హాలులో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నారు. పేర్ల నమోదు, ఇతర వివరాలకు 24982244, 47662029 అనే నెంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుచెందూర్ ఆలయ హుండీ ఆదాయం రూ.3.84 కోట్లు

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని సందర్శించిన భక్తులు స్వామివారికి కానుకలు సమర్పిస్తుంటారు. ఆ ప్రకారం, ఆలయ హుండీల లెక్కింపు ఆదివారం ప్రారంభమై రెండు రోజులు జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు, రూ.3,84,64,297 నగదు, 1.53 కిలోల బంగారం, 22.5 కిలోల వెండి, 27.5 కిలోల ఇత్తడి, 2.4 కిలోల రాగి, 6.5 కిలోల తగరం, 833 విదేశీ కరెన్సీ నోట్లు కానుకలుగా సమర్పించారని ఆలయ అధికారులు తెలిపారు.

11 నుంచి ఇంజనీరింగ్ ఫస్టియర్ తరగతులు

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం ప్రత్యక్ష నియంత్రణలో ఉన్న నాలుగు క్యాంపస్ కళాశాలల్లో ఈనెల 11వ తేది నుంచి ఇంజనీరింగ్ ఫస్టియర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. అలాగే, అన్నా విశ్వవిద్యాలయం ఆధీనంలో పనిచేస్తున్న ప్రైవేటు కళాశాలల్లో ఈ నెల 18వ తేది నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో ఫస్టియర్ తరగతులు ప్రారంభించే తేదీని ఆయా కళాశాలల యజమాన్యాలు నిర్ణయిస్తాయని వర్శిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

వన్నియార్ అంతర్గత రిజర్వేషన్ కమిటీ గడువు పొడిగింపు

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వన్నియార్ అంతర్గత కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. వన్నియార్ అంతర్గత రిజర్వేషన్ ఏర్పాటుపై ప్రభుత్వానికి సిఫారసులు చేసేలా వెనుకబడిన తరగతులు కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ గడువు గత నెల 11వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

మేట్టూరు డ్యాం నుంచి అదనపు జలాల విడుదల నిలిపివేత

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాంలోని 16 క్రస్ట్ గేట్ల ద్వారా అదనపు జలాల విడుదల నిలిపివేశారు. శనివారం ఉదయం డ్యాంకు వస్తున్న నీరు 20,500 ఘనపుటడుగుల నుంచి 16,500 ఘనపుటడుగులకు తగ్గింది. ప్రస్తుతం డ్యాంలో 120 అడుగులతో 93.47 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. డ్యాం నుంచి డెల్టా సాగుకు 16,500 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

రూ.1కి బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డ్

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.1కి బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు అందించే ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేరకు బీఎస్ఎన్ఎల్ తమిళనాడు రీజియన్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ రంగ సంస్థ 'భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రూ.1కి సిమ్ కార్డు అందిస్తుందన్నారు. ఈ సిమ్ కార్డ్ ద్వారా ఈ నెలాఖరు వరకు 4జీ సేవలు ఉచితంగా పొందవచ్చు. అలాగే, ప్రతిరోజు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పొందవచ్చు. ఆసక్తి కలిగిన వారు సమీపంలో ఉన్న వినియోగదారుల సేవా కేంద్రాన్ని సంప్రదించవచ్చని బీఎస్ఎన్ఎల్ తెలిపింది.

కావేరి ఆసుపత్రిలో 65 ఏళ్ల వృద్ధుడి మెదడుకి అరుదైన శస్త్రచికిత్స

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్పేటలోని కావేరి హాస్పిటల్‌లో మెదడులో రెండు పార్శ్వాలలో రక్తస్రావంతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితికి చేరిన 65 ఏళ్ల వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్సలందించినట్లు ఆ ఆసుపత్రి వైద్యనిపుణుడు డాక్టర్ సత్యనారాయణన్ తెలిపారు. మెదడుకు ఎలాంటి హాని కలుగకుండా మిడిల్ మినింజేల్ ఆర్టరీ ఎంబోలైజేషన్ అనే కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఈ శస్త్రచికిత్సను జరిపినట్లు ఆయన వివరించారు. ఈ శస్త్రచికిత్సకు అవసరమైన అన్ని రకాల చికిత్స పరికరాలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండటం వల్లే ఆ వృద్ధుడికి వైద్య నిపుణులు సరైన చికిత్సను అందించి కోలుకునేలా చేశారని కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు.

రాష్ట్రంలో తగ్గనున్న ఎండలు

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత క్రమక్రమంగా తగ్గుతుందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. పశ్చిమ గాలుల వేగంలో మార్పు కారణంగా ఆదివారం నుంచి ఈ నెల 7వ తేది వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. అదే సమయంలో, ఆదివారం అరియలూరు, కళ్లకుర్చి, పుదుకోట, విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాల్లోని ఒకటి రెండు ప్రాంతాలు, పుదుచ్చేరిలో భారీ వర్షం, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై, కడలూరు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, సాయంత్రం, రాత్రి వేళల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. అలాగే, రాష్ట్రంలో ఎండ తీవ్రత 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.


సోదరి వివరాలు చెప్పలేదని తమ్ముడిపై దాడి

● ఇద్దరు యువకుల అరెస్ట్


నిందితులు సంతోష్, శింబు

తిరుత్తణి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సోదరి వివరాలు చెప్పలేదని ఇద్దరు యువకులు ఆమె తమ్ముడిపై దాడికి పాల్పడిన సంఘటన తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని మునిరెడ్డికండిగైలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న విజయ్‌కుమార్ కుమారుడు ముఖేష్ (17) షోళింగర్‌లోని ఓ కళాశాలలో ప్లస్‌టూ చదువుతున్నాడు. అతని సోదరి కూడా అదే కళాశాలలో చదుకుంటుంది. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి కళాశాల ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బస్ కోసం ఎదురుచూస్తున్న సమయంలో కళ్లమమేడు గ్రామానికి చెందిన సంతోష్ (22), శింబు (21)అనే ఇద్దరు యువకులు అక్కడికి వచ్చి డ్రాప్ చేస్తామని ముఖేష్‌ను బైక్‌లో ఎక్కించుకున్నారు. ఆ తర్వాత మార్గమధ్యంలో ఆ యువకులు ముఖేష్ సోదరి గురించిన వివరాలు అడిగారు. దీనితో ఆగ్రహించిన ముఖేష్ తన సోదరి గురించిన వివరాలు మీకెందుకని నిలదీశాడు. దీనితో ముఖేష్‌ని ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన కృష్ణాపురానికి బలవంతంగా తీసుకెళ్ళి అతడిపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. అతడి సోదరి మొబైల్ నెంబర్ తదితర వివరాలు ఇవ్వాలంటూ చితకబాదారు. ఆ తర్వాత ముఖేష్ స్పృహ కోల్పోవడంతో నగిరి రోడ్డులో అతడిని పడేసి వెళ్ళిపోయారు. ఇది చూసిన అక్కడి గ్రామస్తులు ముఖేష్‌ను ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ముఖేష్ వద్ద విచారణ జరిపి కేసు నమోదు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంతోష్, శింబును అరెస్టు చేశారు.

పంద్రాగస్టు వేడుకలకు కడలూరు రైతుకు రాష్ట్రపతి ఆహ్వానం


రాష్ట్రపతి భవన్ నుంచి వచ్చిన ఆహ్వానపత్రాన్ని ప్రదర్శిస్తున్న రైతు రంగరాజ్

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే వేడుకలలో పాల్గొనేందుకు రమ్మంటూ కడలూరు రైతుకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చింది. కడలూరు జిల్లా ఆయికుప్పం ప్రాంతానికి చెందిన రంగరాజ్ అనే రైతుకు రాష్ట్రపతి భవన్ నుండి వచ్చిన ఆహ్వాన పత్రాన్ని కడలూరు సౌత్ జోన్ తపాలాశాఖ సూపరింటెండెంట్ వడివేలన్ స్వయంగా అందించారు. రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో ఈనెల 15నజరిగే వేడుకలలో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం రావటం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని రంగరాజ్ తెలిపారు.

నేడే ధీరన్ చిన్నమలైకు సీఎం నివాళి

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు ధీరన్ చిన్నమలై 220 వర్ధంతి వేడుకలు బుధవారం జరుగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో స్థానిక గిండి, తిరువిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ధీరన్ చిన్నమలై విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, చెన్నై కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొంటారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

● అధికారులకు కలెక్టర్ ప్రతాప్ హెచ్చరిక


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా చోళవరంలో జరుగుతున్న కొత్తరోడ్ల పనులను శనివారం ఉదయం కలెక్టర్ ప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా రూ.43కోట్ల వ్యయంతో నూతన రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించిందని, గ్రామాభివృద్ధిలో భాగమైన ఈ రోడ్ల పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణ నాణ్యతలో ఏమైనా లోపాలుంటే సంబంధిత అధికారిపై, కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు.కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


లాకప్ మరణాలకు డీఎంకే ప్రభుత్వానిదే బాధ్యత

● టీటీవీ దినకరన్

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీవీ సీరియళ్లలా కొనసాగుతున్న లాకప్ మరణాలకు డీఎంకే ప్రభుత్వానిదే బాధ్యత అని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. తిరుప్పూర్ జిల్లా ఉడుమలై సమీపంలో ఉన్న మేల్‌గురుమలై గిరిజన గ్రామానికి చెందిన మారిముత్తు ఫారెస్ట్ రేంజర్ కార్యాలయానికి విచారణ నిమిత్తం తీసుకెళ్ళిన సమయంలో మృతిచెందడంపై దినకరన్ ఈమేరకు ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు.ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో పోలీస్ లాకప్ మరణాలు వరుసగా చోటుచేసుకుంటున్నాయని, ఇటీవల తిరుభువనం సమీపంలోని ఆలయ వాచ్‌మెన్ అజిత్‌కుమార్ అనుమానాస్పద మృతిపై చెలరేగిన ఆందోళన సర్దుమణగక ముందే మళ్ళీ గిరిజన కుటుంబానికి చెందిన మారిముత్తు మృతిపట్ల రాష్ట్రప్రజలు భయాందోళనకు గురయ్యారని ఆరోపించారు. లాకప్ మరణాలకు బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయడంతో పాటు మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తండ్రిపై నిఘా వేసిన ఏకైన తనయుడు అన్బుమణి!

● పీఎంకే నేత రాందాస్ విమర్శ


మీడియాతో మాట్లాడుతున్న పీఎంకే నేత రాందాస్

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తన నివాసంలో సీక్రెట్ వాయిస్ రికార్డర్ ఏర్పాటు చేసి తన కదలికలపై నిఘా వేసింది కుమారుడు అన్బుమణి మాత్రమేనని పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ విమర్శించారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో శనివారం మీడియాతో ఈ మేరకు రాందాస్ తన తనయుడి గురించి పేర్కొన్నారు. ఈ నెల 17న తన అధ్యక్షతన నిర్వహించదలిచిన పార్టీ సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు పార్టీ అజెండా ప్రకారం ఆహ్వానిస్తామని, ఈ సమావేశం వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. తనకు పోటీగా అన్బుమణి ప్రకటించిన సర్వసభ్య సమావేశం పార్టీ నిబంధనలకు విరుద్ధమని, ఆ సమావేశం అంగీకారయోగ్యం కాదన్నారు. ఎన్నికల కమిషన్ విధుల ప్రకారం 15 రోజులకు ముందే పార్టీ సభ్యులకు సమావేశం గురించి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. తన నివాసమైన తైలాపురం గార్డెన్‌లో తన కదలికలను తెలుసుకునేలా సీక్రెట్ వాయిస్ రికార్డర్ ఏర్పాటు చేసిన ఏకైక కుమారుడు అనే ఘనత అన్బుమణికే వర్తిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో, రాందాస్ నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి పోటీగా ఈ నెల 17న మహాబలిపురంలో పీఎంకే రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అన్బుమణి ప్రకటించడం ద్వారా తండ్రీ కొడుకుల మధ్య చోటుచేసుకున్న విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

బాలికకు లైంగిక వేధింపులు

● ఎస్ఐ సహా నలుగురు 'డిస్మిస్'

పెరంబూర్,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): ముక్కొంబు డ్యాం ప్రాంతంలో, బాలికను బెదిరించి లైంగిక వేధింపులకు గురిచేసిన ఎస్ఐ, ముగ్గురు పోలీసులు డిస్మిస్ అయ్యారు. తిరుచ్చి జీయాపురం ఎస్ఐగా పనిచేస్తున్న శశికుమార్, నవల్‌పట్టు పోలీసు ప్రసాద్, తిరువెరుంబూర్ ప్రాంత రహదారి గస్తీ పోలీసు శంకర్ రాజపాండియన్, జీయాపురం ట్రాఫిక్ పోలీసు సిద్ధార్థన్‌లు గత 2023 అక్టోబరు 4న కారులో సాధారణ దుస్తుల్లో ముక్కొంబు డ్యాంకు వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన నలుగురు, ఆ ప్రాంతంలో సంచరిస్తున్న రెండు ప్రేమ జంటలను బెదిరించారు. వారిలో అరియమంగళం ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలికతో ఉన్న 19 ఏళ్ల యువకుడిని బెదిరించి, చితకబాది అక్కడినుంచి పంపించివేశారు. అనంతరం బాలికను కారులో తీసుకెళ్లిన వారు ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈవిషయమై బాధిత బాలిక ముక్కొంబు అవుట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం అప్పటి ఎస్పీగా ఉన్న వరుణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో, విచారణకు ఆదేశించిన ఎస్పీ, ముగ్గురు పోలీసులు, ఎస్ఐను సస్పెండ్ చేశారు. జీయాపురం మహిళా పోలీసులు కేసు నమోదు చేసి, శశికుమార్, శంకర్ రాజపాండియన్, ప్రసాద్, సిద్ధార్థన్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం చేపట్టిన విచారణలో... ఎస్ఐ, ముగ్గురు పోలీసులపై వచ్చిన ఆరోపణలు నిరూపితం కావడంతో, క్రమశిక్షణ నిబంధనల మేరకు, నలుగురిని శాశ్వతంగా తొలగిస్తూ తిరుచ్చి డీఐజీ వరుణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

పాఠశాల ఉపాధ్యాయుల ఫెడరేషన్ సమావేశం



జెండా ఎగురవేస్తున్న జనార్ధనన్

వేలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఉపాధ్యాయ ఫెడరేషన్ సమావేశం స్థానిక ఉపాధ్యాయుల హోంలో శనివారం జరిగింది. కార్యక్రమానికి జిల్లా ఆర్గనైజర్ జోసఫ్ అనన్యా అధ్యక్షత వహించారు. అఖిల భారత కార్యకర్తల కమిటీ సభ్యుడు, రాష్ట్ర ఉన్నత పాఠశాలల టెక్నికల్ విద్య ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్ధన్ పాల్గొని, తొలుత ఫెడరేషన్ జెండా ఎగురవేశారు. అనంతరం రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కు చట్టాన్ని కాపాడుకోవాలని ప్రసంగించారు. కార్యక్రమంలో మహిళా శాఖ ఆర్గనైజర్ సిలంబరసి, జాయింట్ ఆర్గనైజర్ మంజుల, యశోధ, జిల్లా ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు ధనశేఖరన్, కృష్ణన్, భూపాలన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కొల్‌కత్తాలో జరుగనున్న ఫెడరేషన్ జాతీయ మహానాడు ప్రతినిధులుగా ఎంపికైన జనార్ధనన్, అనన్యా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంజన్ దయాళ్‌దాస్‌లను సభ్యులు శాలువాలు కప్పి అభినందించారు.

మా కూటమి నుంచి మిత్రపక్షాలు వైదొలగవు

● మంత్రి కేఎన్ నెహ్రూ

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమి నుంచి ఏ పార్టీలు వైదొలగవని మంత్రి కేఎన్ నెహ్రూ స్పష్టం చేశారు. నగరంలో శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే కూటమిలోని పార్టీలు అసంతృప్తిగా ఉన్నాయని, ఈ కూటమి నుంచి వైదొలగడం ఖాయమని అన్నాడీఎంకే నేతలు మాట్లాడుతున్నారని, వారి ఆశలు నెరవేరవని అన్నారు. కానీ, ఎన్డీఏ కూటమి నుంచి పలు పార్టీలు వైదొలగడం ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం ఒ.పన్నీర్‌సెల్వం ఎన్డీఏ కూటమికి గుడ్ బై చెప్పారని తెలిపారు. పలు విషయాల నుంచి బయటపడేందుకు ఎడప్పాడి బీజేపీ కూటమిలో ఉన్నారన్నారు. ప్రజల్లో ఒకరిగా వారికి మంచి వైద్యసేవలు అందించేలా వైద్య శిబిరాలను శనివారం సీఎం ప్రారంభించారని, ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

అవయవ దానంలో రాష్ట్రానిదే ప్రథమస్థానం

ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. స్థానిక శాంథోం సెయింట్ బీడ్స్ ఆంగ్లో ఇండియన్ పాఠశాల ప్రాంగణంలో శనివారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ 'నలంకాక్కుం స్టాలిన్' అనే పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ, అవయవ దానంలో ప్రథమ స్థానం దక్కించుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా పురస్కారం బహూకరించినట్లు తెలిపారు. అవయవ దానంలో దేశంలోని మిగతా రాష్ట్రాలకు తమిళనాడు ఆదర్శంగా ఉందని, గత 2008వ సంవత్సరం అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి అవయవ మార్పిడి శస్త్ర చికిత్స పథకాన్ని పరిచయం చేశారని, అప్పటినుంచి అవయవ దానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరిగిందన్నారు. ప్రమాదాల్లో చిక్కుకున్న కారణంగా మెదడు నిర్జీవమైన వ్యక్తుల అవయవాలను వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రులకు ఇప్పటి వరకు దానంగా ఇస్తున్నారని, సీఎం స్టాలిన్ 2023 సెప్టెంబర్ 23న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అవయవాలు దానం చేసిన మృతులు 479 మందికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. గత 2024వ సంవత్సరంలో మాత్రమే 268 మంది అవయవాలు దానం చేయడం దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో రికార్డుగా నమోదైందని మంత్రి వివరించారు.

తప్పుదారి పట్టించిన గూగుల్ మ్యాప్

● వాగుపైన ఇరుకుదారిలో చిక్కుకున్న కారు



ఇరుకుదారిలో నిలిచిన కారు

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కరూరు జిల్లా కుళిత్తలై ప్రాంతం వద్ద కారులో గూగుల్ మ్యాప్ ద్వారా దర్గాను వెతుక్కుంటూ వెళ్ళిన వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. ఓ పిల్లవాగుపై ద్విచక్రవాహనాలు, ఆటోలు మాత్రమే వెళ్లడానికి వీలున్న వంతెనపై వెళితే దర్గా ఉందని గూగుల్ మ్యాప్ తెలిపింది. దీనితో ఆ వ్యక్తి కారును మళ్ళించి, ఆ వాగుపై ఇరుకైన వంతెన రహదారిలో నడిపాడు. కొద్ది దూరం వెళ్ళిన తర్వాత రహదారి వెడల్పు తగ్గి ముందువైపున్న చక్రం పక్కవాటున దిగిపోయింది. దీనితో ఆ వ్యక్తి కారును సడన్ బ్రేక్‌వేసి నిలిపాడు. తంజావూరు జిల్లా కుంభకోణం ప్రాంతానికి చెందిన మహమ్మద్ (50) కారులో కోయంబత్తూరుకు వెళ్ళి స్వస్థలానికి బయలుదేరాడు. కరూరు నుండి తిరుచ్చి వెళ్లే మార్గంలో కుళిత్తలై సమీపంలో కారులో వెళుతున్న మహమ్మద్ దర్గాలో నమాజు చేయాలని అనుకున్నాడు. ఆ చుట్టుపక్కల దర్గాలేవైనా ఉన్నాయా అని గూగుల్ మ్యాప్‌లో వెదికాడు. అక్కడికి చేరువగానే వాగుపైనున్న చిన్న వంతెన దాటితే దర్గా వస్తుందని గూగుల్ మ్యాప్‌లో దారిని చూపెట్టింది. దానినను సరించి మహమ్మద్ కారును నడుపుకుంటూ వెళ్ళి ఆటోలు మాత్రమే నడిచేందుకు వీలున్న వాగు వంతెనపై కారును మళ్ళించారు. కొద్ది దూరం పోయాక ఆ కారు ముందువైపు టైర్ వాగువంతెన పక్కగా వేలాడసాగింది. వెంటనే బ్రేకులు వేసి కారును నిలిపివేశాడు. ఆ లోపున స్థానికులు అక్కడికి పరుగెత్తుకుంటూ వెళ్ళి కారులో ఉన్న మహమ్మద్‌ను చాకచక్యంగా బయటకు లాగి కాపాడారు. ఆ తర్వాత భారీ క్రేన్‌ను తెప్పించి కారును అక్కడి నుండి తొలగించారు.

అర్ధరాత్రి స్కూలు వద్ద అడవి ఏనుగు సంచారం


స్కూలు ప్రాంగణం నుంచి వెళుతున్న అడవి ఏనుగు

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపం తాళవాడి వద్దనున్న అడవి నుండి బయటకొచ్చిన ఏనుగు చిక్కలి గ్రామంలోకి చొరబడింది. శుక్రవారం అర్ధరాత్రి ఆ ఏనుగు ఇళ్లవైపు నడుస్తుండగా చూసి స్థానికులు భీతిల్లారు. ఆ ఏనుగు అక్కడికి చేరువుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సంచరించింది. పావుగంటకు పైగా ఆ స్కూలును రెండుసార్లు ప్రదక్షిణ చేసిన ఆ ఏనుగు అక్కడి నుండి కదలింది. స్థానికులు. అటవీ శాఖ సిబ్బంది డప్పులు మోగించి ఏనుగును తరిమి కొట్టేందుకు ప్రయత్నించారు. శనివారం వేకువజాము వరకు ఆ ఏనుగు స్థానికులను ముప్పుతిప్పలు పెట్టి అడవిలోకి పారిపోయింది.

స్కూలు విద్యార్థినులపై లైంగిక వేధింపులు

● మతబోధకుడి అరెస్టు


అరెస్టయిన డేవిడ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన రెడ్‌హిల్స్ వద్ద స్కూలు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన మతబోధకుడిని పోలీసులు అరెస్టు చేశారు. రెడ్‌హిల్స్ మమత్తుకుళం పెరుమాళ్ కోవిల్ వీధిలో కామరాజ్ అలియాస్ డేవిడ్ (54) అనే క్రైస్తవ మతబోధకుడు నివసిస్తున్నాడు. ఆ ప్రాంతంలోనే ఓ చర్చిని నడుపుతున్నాడు. ఆయన భార్య జయా (50) అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తోంది. అంగన్వాడీ స్కూలులో చదివే విద్యార్థినులకు చర్చిలో రోజూ ట్యూషన్‌లు చెబుతుండేది. ఈ నేపథ్యంలో చర్చిలో ట్యూషన్‌కు వెళ్ళిన విద్యార్థినులలో కొందరి పట్ల డేవిడ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీనితో విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు రెడ్‌హిల్స్ మహిళా పోలీసుస్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని డేవిడ్‌ను అరెస్టు చేశారు.

విచారణ ఖైదీ మృతి

● ఇద్దరు ఫారెస్ట్ గార్డులపై సస్పెన్షన్ వేటు

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా ఉడుమలైలోని ఫారెస్ట్ రేంజర్ కార్యాలయానికి విచారణ నిమిత్తం తీసుకెళ్ళిన ఖైదీ అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటనలో ఇద్దరు ఫారెస్ట్ గార్డులపై సస్పెన్షన్ వేటు పడింది. ఉడుమలై ప్రాంతంలోని అటవీ మార్గంలో గత 29వ తేదీన (మంగళవారం) అనుమానాస్పదంగా సంచరించిన మేల్‌గురుమలై గిరిజన గ్రామానికి చెందిన మారిముత్తు (41)అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఫారెస్ట్ గార్డులు అతడిని విచారణ నిమిత్తం ఫారెస్టు రేంజర్ కార్యాలయానికి తరలించారు. ఈ నేపథ్యంలో, మారిముత్తు హఠాత్తుగా మృతిచెందిన సంఘటన ఉడుమలై ప్రాంతంలో కలకలం రేపింది. మారిముత్తు మృతికి కారణమైన ఫారెస్ట్ గార్డులు సెంథిల్‌కుమార్, విమల్ అనే ఇద్దరిని అరెస్టు చేయాలని, అప్పటివరకు మృతదేహానికి అంత్యక్రియలు జరపబోమంటూ మళయూర్ ప్రాంతానికి చెందిన గిరిజనులు ఉడుమలై ఫారెస్ట్ రేంజర్ కార్యాలయం ముందు గుమిగూడి శుక్రవారం నిరసన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాత్రి 9.25 గంటలకు తిరుప్పూర్ ప్రభుత్వాసుపత్రి విడుదల చేసిన పోస్టుమార్టం రిపోర్టులో చిత్రహింసల వల్లే మారిముత్తు మృతిచెందినట్లు నిర్ధారణ అయ్యింది. దీనితో ఆనమలై పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు శవాన్ని తరలించిన వాహనాన్ని చుట్టుముట్టి మళ్ళీ అటవీశాఖ సిబ్బందికి వ్యతిరేకంగా ఆందోళనలో పాల్గొన్నారు. దీనితో పోలీసుల భద్రత మధ్య మృతదేహాన్ని మారిముత్తు నివాసానికి తరలించారు. ఇదిలా వుండగా, మారిముత్తు మృతికి కారణమైన ఫారెస్ట్ గార్డులు సెంథిల్‌కుమార్, విమల్‌లను సస్పెండ్ చేస్తూ ఫారెస్ట్ రేంజర్ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

40 కిలోల పొగాకు ఉత్పత్తుల స్వాధీనం

వేలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్తువాచేరిలో 40 కిలోల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఒకరిని అరెస్ట్ చేశారు. నగరంలో నిషేధ పొగాకు ఉత్పత్తులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సత్తువాచేరి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడిని అదుపులోకి తీసుకుని అతడి బ్యాగును పరిశీలించి 40 కిలోల పొగాకు ఉత్పత్తులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వేలూరుకు చెందిన జగన్నాధన్ అని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఉత్తర్వుల మేరకు వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

నీట మునిగి అక్కాచెల్లెళ్ల మృతి

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నీటమునిగి అక్కా, చెల్లెలు మృతిచెందిన ఘటన దిండుగల్ జిల్లాలో చోటుచేసుకుంది. పొన్‌మాందూర్ పుదుపట్టి ప్రాంతంలోని బావిలో ఇద్దరు బాలికల మృతదేహాలను శనివారం ఉదయం గుర్తించిన స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకున్న పోలీసులు, మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం దిండుగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విచారణలో... మృతులు పుదుపట్టికి చెందిన సుందరమహాలింగం-సుమతి దంపతుల కుమార్తెలు ఒచ్చమ్మాళ్ (11), తమిళ్‌సెల్వి (10)లుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, వీరిని ఎవరైనా హత్య చేసి బావిలో పడేశారా? స్నానానికి వెళ్లి నీటిలో జారిపడి మృతిచెందారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఆమ్నీ బస్సులో బాలికకు లైంగిక వేధింపులు : డ్రైవర్ అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) ఆమ్నీ బస్సులో 9 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన డ్రైవర్ పోక్సో చట్టం కింద అరెస్టయ్యాడు. కేరళ రాష్ట్రం కన్నూరు నుంచి చెన్నై వైపుకు వెళ్తున్న ఆమ్నీ బస్సు డ్రైవర్ వెనుక సీట్లో బాలిక తల్లితో కలసి ప్రయాణిస్తోంది. ఆ సమయంలో బస్సు డ్రైవర్ జ్ఞానవేలు, బాలికకు సెల్‌ఫోన్‌లో అసభ్య చిత్రాలు చూపిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతుండడాన్ని కొందరు ప్రయాణికులు గమనించారు. బస్సు విల్లుపురం చేరుకున్న వెంటనే బాధిత బాలిక తల్లి, ప్రయాణికులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో కింద కేసు నమోదుచేసి జ్ఞానవేలును అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

15లోపు 50 శాతం టోల్‌గేట్ బకాయిల చెల్లింపు

● హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): టోల్ గేట్ బకాయిల్లో 50 శాతం ఈ నెల 15వ తేదిలోపు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. దక్షిణ జిల్లాల్లోని నాలుగు చెక్‌పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.276 కోట్ల టోల్ రుసుము బకాయిలు ఉంచినట్లు, బకాయిలు సత్వరం విడుదల చేసేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ హైకోర్టులో నాలుగు టోల్‌గేట్ సంస్థలు పిటిషన్ దాఖలు చేశాయి. కోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వం దాఖలుచేసిన అఫిడవిట్‌లో.. టోల్ గేట్ బకాయిలు 50 శాతం ఈ నెల 15వ తేదిలోపు, మిగిలిన బకాయిలు సెప్టెంబరులోపు చెల్లిస్తామని తెలిపింది. అన్ని ప్రభుత్వ బస్సులకు ఫాస్టాగ్ విధానంలో టోల్ రుసుము చెల్లించేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ వివరణ అనంతరం, తదుపరి విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదావేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

కేరళకు తరలిస్తున్న రూ.26 లక్షల హవాలా నగదు స్వాధీనం

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేరళకు తరలిస్తున్న రూ.26 లక్షల హవాలా నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోవై కేకే చావిడి ప్రాంతంలో శుక్రవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులను విచారించారు. వారు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో, వారి వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా కట్టకట్టలుగా నోట్లు ఉండడం గమనించారు. విచారణలో... వారు కేరళ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ హకీమ్, అబ్దుల్ రెహ్మాన్‌లుగా గుర్తించిన పోలీసులు, నగదుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి దస్తావేజులు లేకపోవడంతో హవాలా నగదుగా భావించి వారిని విచారిస్తున్నారు.

కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసిన రాజ్యసభ ఎంపీ

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే రాజ్యసభ ఎంపీ ధనపాల్ తన యూనియన్ కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. స్థానిక తిరుకళకుండ్రం పంచాయతీ యూనియన్ 26వ వార్డు అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీ చేసిన ధనపాల్ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో, ధనపాల్ అన్నాడీఎంకే తరఫున రాజ్యసభ సభ్యులుగా ఇటీవల ఎంపికయ్యారు. ఈ కారణంగా తన యూనియన్ కౌన్సిలర్ పదవికి ఆయన రాజీనామా చేశారు. యూనియన్ నిర్వాహకులకు రాజీనామాలేఖను అందజేయగా, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యాలయానికి లేఖ పంపించినట్లు అధికారులు తెలిపారు.

'గ్రాండ్ ఫాదర్'గా ఎంఎస్ భాస్కర్

తాజాగా కేంద్రం ప్రకటించిన 71వ జాతీయ అవార్డుల్లో ప్రాంతీయ భాషా చిత్రాల విభాగంలో తమిళంలో ఉత్తమ సహాయ నటుడి అవార్డుకు ఎంపికైన ఎం.ఎస్.భాస్కర్, ఫ్రాంక్‌స్టార్ రాహుల్‌లు ప్రధాన పాత్రల్లో 'గ్రాండ్ ఫాదర్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ శనివారం విడుదల చేశారు. కుట్టి స్టోరీస్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో స్నీకా, అరుల్‌దాస్, మునీష్కాంత్, శ్రీనాథ్, శివ, అరవింద్, ప్రియదర్శిని, అంజలి రావ్, అభినయ తదితరులు నటించారు. శ్రీధర్ కెమెరామెన్‌గా పనిచేస్తున్న ఈ చిత్రానికి రంజిన్ రాజ్ సంగీతం సమకూర్చారు. ఫ్రాంక్ స్టార్ రాహుల్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మెట్రో మురళి, మెట్రో గిరి, భవనేష్ చిన్నస్వామి నిర్మాతలు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ సినిమా చిత్రీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో ప్రధాన పాత్రను పోషిస్తున్న ఎంఎస్ భాస్కర్‌కు జాతీయ అవార్డు వరించింది. ఆయనను చిత్ర బృందం ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆయన గౌరవార్థం మూవీ నుంచి ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేస్తున్నాం. ఈ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటుందని గట్టిగా నమ్ముతున్నాం' అని పేర్కొన్నారు.


'గ్రాండ్ ఫాదర్' ఫస్ట్‌లుక్

బ్లాక్ అండ్ వైట్‌లో వరలక్ష్మి గ్లామర్ ఎక్స్‌పోజ్



వరలక్ష్మి శరత్ కుమార్

ఇటు తమిళం, అటు తెలుగు చిత్రపరిశ్రమలో ప్రత్యేక క్రేజ్‌ను సొంతం చేసుకున్న నటి వరలక్ష్మి శరత్ కుమార్ తాజాగా శ్రీలంక టూర్‌కు వెళ్ళి బ్లాక్ అండ్ వైట్‌లో గ్లామర్ ఎక్స్‌పోజింగ్ చేస్తూ స్పెషల్ ఫొటో షూట్ చేశారు. ఈ ఫొటోలను ఆమె తాజాగా సామాజికమాధ్యమాల్లో పోస్ట్ చేశారు. తన వ్యక్తిగత గ్రాఫర్ కేసర ఆమె అందాలను తన కెమెరాలో బంధించారు. 'ప్రతి ఫొటో గౌరవానికి ప్రతీక' అంటూ ఆమె కామెంట్స్ చేశారు. కాగా, నేటితరంలో ఉన్న అత్యంత సాహసోపేతమైన నటీమణుల్లో వరలక్ష్మి ఒకరు. అనేక రకాలైన పాత్రలను ఎంచుకుంటూ తన సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. కేవలం హీరోయిన్ పాత్రలకే పరిమితంకాకుండా, క్యారెక్టర్, ప్రతినాయకురాలి పాత్రల్లో నటిస్తూ, ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఇటీవల 'ది వెర్డిక్ట్' చిత్రంలో ప్రధాన పాత్రను పోషించగా, ఇందులో ఆమె నటనకు సినీ విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు వచ్చాయి. ఇదిలావుంటే, ఇటీవల ముంబైకు చెందిన పారిశ్రామికవేత్తను వివాహం చేసుకున్న వరలక్ష్మి.. తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్న విషయం తెల్సిందే.

రజనీకాంత్ 'కూలీ'కి 'ఏ' సర్టిఫికెట్

చిత్రజ్యోతి

సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కూలీ' ఈ నెల 14వ తేదీన విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను తాజాగా పూర్తి చేసుకుంది. సినిమాను చూసిన సెన్సార్ కమిటీ సభ్యులు మూవీకి 'ఏ' సర్టిఫికెట్‌ను మంజూరుచేశారు. అలాగే, ఈ సినిమా రన్ టైమ్ 2 గంటల 48 నిమిషాలుగా ఉన్నట్టు వెల్లడైంది. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నిర్మాత కళానిధి మారన్ సన్ పిక్చర్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. ఇందులో రజనీకాంత్‌తో సహా నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్, సత్యరాజ్, శృతి హాసన్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి కెమెరా క్రిష్ గంగాధరన్, సంగీతం అనిరుధ్ రవిచందర్. వేతన కార్మికులు, గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో ఈ చిత్ర కథాంశం కొనసాగనుంది. ఇందులో అధిక మోతాదులో హింసాత్మక సంఘటనలు ఉండటంతో 'ఏ' సర్టిఫికెట్‌ను మంజూరు చేశారని కోలీవుడ్ వర్గాల సమాచారం.


'కూలీ'లో రజనీకాంత్

జీవీ ప్రకాష్ - ఎంఎస్ భాస్కర్‌లకు అభినందనల వెల్లువ


ఏఆర్ రెహ్మాన్ - జీవీ ప్రకాష్

గత 2023 సంవత్సరానికిగాను కేంద్రం తాజాగా ప్రకటించిన 71వ జాతీయ అవార్డులకు ఎంపికైన సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఎంఎస్ భాస్కర్‌లకు చిత్రపరిశ్రమకు చెందిన అనేక సినీ ప్రముఖులు అభినందలు తెలుపుతున్నారు. ఇదే విషయంపై నడిగర్ సంఘం నిర్వాహకులు శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ అవార్డులకు ఎంపికైన కళాకారుల ప్రతిభను నడిగర్ సంఘం ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నట్టు పేర్కొంది. 'పార్కింగ్' చిత్రంలో నటించిన ఎంఎస్ భాస్కర్‌కు జాతీయ ఉత్తమ సహాయ నటుడు, 'వాత్తి' సినిమాకు సంగీతం సమకూర్చిన జీవీ ప్రకాష్ కుమార్‌కు ఉత్తమ సంగీత దర్శకుడు, 'పార్కింగ్' దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్ ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డులను గెలుచుకున్న శుభసందర్భంలో వీరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు నడిగర్ సంఘం నిర్వాహకులు విడుదల చేసి పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే అగ్ర నటుడు కమల్ హాసన్, అకాడెమీ అవార్డు గ్రహీత ఏ.ఆర్.రెహ్మాన్ తదితర సినీ ప్రముఖులు వేర్వేరు ప్రకటనలో అవార్డు విజేతలకు తమ అభినందనలు, ప్రశంసలు తెలిపారు.

దెబ్బతిన్న అవయవాలకు ఊపిరి పోయండి!

● వైద్యులకు 'రీజెన్ 2025' సదస్సు పిలుపు


సదస్సులో పాల్గొన్న వైద్యనిపుణులు

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైద్యనిపుణులు రోగాలను నయం చేయడంతోనే సరిపెట్టుకోకుండా, రోగాల వల్ల దెబ్బతిన్న అవయవాలకు కొత్త ఊపిరి పోసి, అవన్నీ మళ్ళీ చక్కగా పనిచేసే రీతిలో నాణ్యమైన చికిత్సలందించాలని 'రీజెన్ 2025' సదస్సులో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. తేనాంపేటలోని స్టార్‌హోటల్‌లో శనివారం ఉదయం ఎముకల చికిత్స, నొప్పుల నివారణ, క్రీడా సంబంధిత గాయాలకు చికిత్స, తదితర చికిత్సలకు సంబంధించిన వైద్యపోకడలపై సమగ్రంగా చర్చించేందుకుగాను 'రీజెన్ 2025' పేరుతో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో దేశవిదేశాల నుండి విచ్చేసిన సుమారు 500 మంది వైద్యనిపుణులు, ప్రతినిధులు పాల్గొన్నారు. రీజెన్ 2025 చైర్‌పర్సన్ డాక్టర్ షర్మిలతుల్‌పులే, తమిళనాడు మల్టీ సూపర్‌స్పెషాలిటీ హెడ్ డాక్టర్ జీకే కుమార్, అపోలో హాస్పిటల్ సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ నావలాడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆక్సీలియం కళాశాల 66వ స్నాతకోత్సవం

వేలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి గాంధీనగర్‌లో ఉన్న ఆక్సీలియం కళాశాల 66వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి అన్నా విశ్వవిద్యాలయ నానో టెక్నాలజీ డైరెక్టర్ దేవసేన ముఖ్యఅతిథిగా పాల్గొని, 879 మంది విద్యార్థులు డిగ్రీలు, 241మందికి ఎంఏ డిగ్రీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లెక్చరర్ అరుబ్‌కోమేరి జోష్‌ఫిన్ రాణి తదితరులు పాల్గొన్నారు.


డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులు

తిరుత్తణి మురుగన్ సేవలో

● పీఎంకే నేత అన్బుమణి రాందాస్


మురుగన్‌ను దర్శించుకుంటున్న పీఎంకే నేత అన్బుమణి రాందాస్

తిరుత్తణి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయాన్ని శనివారం ఉదయం పీఎంకే నేత అన్బుమణి సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'హక్కులను సాధించండి - రాష్ట్ర ప్రజలను కాపాడండి' అనే నినాదంతో ఇటీవల ప్రారంభించిన పాదయాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం తిరుత్తణికి చేరుకున్న ఆయన ఓ ప్రైవేటు హోటల్‌లో బసచేశారు. శనివారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య తిరుత్తణి కొండపైకి చేరుకుని శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్లకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు, ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టీ సురేష్‌బాబు తదితరులు అన్బుమణిని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనం ముగించుకుని బయటకు వచ్చిన ఆయనను మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం తెలుపకుండానే వెళ్ళిపోవడం గమనార్హం.


చెన్నై క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను కలుసుకున్న మక్కల్‌నీదిమయ్యం నాయకుడు కమల్‌హాసన్


శాంథోమ్‌లో 'నలంకాక్కుమ్ స్టాలిన్' వైద్యపరీక్షల శిబిరంలో ఓ మహిళకు వైద్యపరీక్షల ఫలితాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



చెన్నై - పుదుచ్చేరి మధ్య ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో బంగాళాఖాతం ఒడ్డున మొండి గోడలతో ప్రాచీన కాలపు ఆనవాళ్లను మాత్రమే నేటి తరం ముందు ఆవిష్కరింపజేస్తున్న 'ఆలంపరైకోట' ఆర్కాటు నవాబులు చక్రం తిప్పిన పాలనా కేంద్రంగా ఉండేదని చెబితే అందరికీ ఆశ్చర్యం కలుగుతుంది. ఆ కోట ప్రాంతం గురించిన ప్రస్తావనలు తమిళ సంగసాహిత్యంలో ఉండటం గమనించి నేటి సాహిత్యకారులు కూడా విస్మయం చెందుతున్నారు. ఆ కోటలో పుదుచ్చేరి పాలకుల కోసం బంగారు నాణేలను తయారుచేసిన టంకశాల కూడా ఉండేదని పురావస్తు పరిశోధకులు తమ తవ్వకాల సాక్షిగా లోకానికి ఎలుగెత్తిమరీ చాటుతున్నారు. ఆ కోట దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రాముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు. ఇంతటి కీర్తిని సంతరించుకున్న ఈ అద్భుతమైన ఆలంపరై కోట ఆ నాటి ఆంగ్లేయ పాలకుల నిర్లక్ష్యం కారణంగా కాలగమనంలో మట్టికొట్టుకుపోయింది.
18వ శతాబ్దంలో ఈ కోట పూర్తిగా శిథిలావస్థకు చేరింది.
ఆ కోట దుస్థితికి దారితీసిన కారణాలు ఎన్నెన్నో...

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

● కడలి తీరంలో మిగిలిన చారిత్రక ఆనవాళ్లు!

ఆర్కాటు నవాబుల పాలనా కేంద్రం ఆలంపరైకోట!

'పత్తుపాట్టు'తో సంబంధం...

17వ శతాబ్దం నుండి వలసరాజ్యాల కాలంలో రాష్ట్రంలోని తూర్పుతీరం పొడవునా ఎన్నో కోటలు నిర్మించారు. ఆ కోటలు వాటి నిర్మాణ సమయంలోనే, ఆ తర్వాత కొన్ని దశాబ్దాల తర్వాతో అప్పటి పాలకుల పాలనా కేంద్రాలుగా, రాజకీయ, వాణిజ్య ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలుగా ఉండేవి. అప్పట్లో నిర్మించిన కోటలన్నీ శత్రుదుర్భేద్యంగా ఉండేవి. ఫిరంగులతో దాడులు జరిపినా చెక్కుచెదరని ప్రహరీలతో నిర్మితమయ్యేవి. అయితే 19వ శతాబ్దం చివరన ఆ కోటలన్నీ వాటి అధికార ప్రాముఖ్యతలను కోల్పోతూ వచ్చాయి. కొన్ని కోటలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలా కాలగమనంలో శిథిలావస్థకు చేరిన కోటలలో ఒకటే ఈ ఆలంపరై కోట. చెన్నై నుండి అత్యంత పొడవుగా సాగే ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో 100 కి.మీ.ల దూరంలో ఉంది ఇడైకళినాడు. ఈ గ్రామం కాంచీపురం జిల్లా సెయ్యూరు తాలూకాలో ఉంది. ఈ ప్రాంతం 'పత్తుపాట్టు' (తమిళ సంగ సాహిత్యాలు అని పేర్కొనబడే ప్రాచీన తమిళ సాహిత్య గ్రంథాల సంకలనం) గ్రంథంలోని 'సిరుపాణాట్రుపడై'తో సంబంధం కలిగి ఉంది. ఒయమానాట్టు నాయకుడైన 'నల్లియ కోడన్' గురించి కీర్తించిన సిరుపాణాట్రుపడై స్వరకర్త 'ఇడైకళినాడు నల్లూరు ఈత్తనార్' అని పేర్కొన్నారు. ఆ ఇడైకళినాడు ప్రాంతంలోనే ఉంది ఈ ఆలంపరై కోట. చారిత్రక గ్రంథాలలో 'ఆలంపర్వా', 'ఆలంపురవి' అని ప్రస్తావింపబడిన ఆలంపరైకోటను 17వ శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతారు.

పుదుచ్చేరితో సంబంధాలు...

సదాతుల్లాఖాన్ మృతి తర్వాత, దోస్త్ అలీఖాన్ ఆర్కాట్ నవాబు అయ్యాడు. ఈ నవాబు పాలనకాలానికి సంబంధించిన చారిత్రక రికార్డులలో పలుచోట్ల ఆలంపరైకోట ప్రస్తావనలు ఉన్నాయి. ఆ కాలంలోనే ఆలంపరై కోటకు సమీపంగా ఉన్న పుదుచ్చేరి ప్రాంతం ఫ్రెంచ్ పాలకుల ఏలుబడిలో ఉండేది. అప్పట్లో పుదుచ్చేరి గవర్నర్‌గా జోసెఫ్ ఫ్రాంకోయిస్ డూప్లే ఉండేవారు. ఆయన వద్ద పుదుచ్చేరి వ్యాపారి ఆనందరంగం పిళ్లై దుబాసీ (అనువాదకుడి)గా పనిచేశారు. ఆయన తన రోజువారీ కార్యకలాపాల గురించి డైరీలో రాసుకునేవారు. ఆ డైరీలోనే ఆలంపరై కోట గురించిన సమాచారాలు అధికంగా లభించాయి. కర్నాటక నవాబు దోస్త్ అలీఖాన్ తన రాజ్యం కోసం నాణేలను పుదుచ్చేరిలో ముద్రించడానికి సంబంధించిన అనుమతి పత్రాన్ని 1736వ సంవత్సరం, సెప్టెంబర్ 10న ఆలంపరై నుండి పంపినట్లు ఆనందరంగం పిళ్లై తన డైరీలో రాసి ఉంచారు. ఆ డైరీలో పుదుచ్చేరిలో నాణేలను ముద్రించే సగం పనులను ఆలంపరైకి చెందిన 'పొట్టి బట్టన్' అనే వ్యక్తికి అప్పగించినట్లు కూడా పేర్కొన్నారు. ఈ విధంగా ఆ డైరీలో పలుచోట్ల ఆలంపరై గురించిన విశేషాలు ఎన్నో ఉన్నాయి. 1740లో దోస్త్ అలీఖాన్ మరాఠీలతో జరిగిన యుద్ధంలో మృతి చెందాడు. రెండో కర్నాటక యుద్ధంలో అప్పటి ఆర్కాట్ నవాబు అన్వరుద్దీన్‌ను యుద్ధంలో ఓడించి చందాసాహెబ్ 1749లో కొత్త నవాబు అయ్యాడు. కర్నాటక యుద్ధంలో చందాసాహెబ్‌కు ఫ్రెంచ్ గవర్నర్ డూప్లే అండగా నిలిచి సహాయ సహకారాలు అందించారు. ఫలితంగా 1750లో ఆలంపరై కోట ఫ్రెంచ్‌వారి వశమైంది. అయితే ఈ కోట ఎక్కువ కాలం ఫ్రెంచ్‌వారి ఆధీనంలో ఉండలేకపోయింది. వందవాసి యుద్ధం తర్వాత పుదుచ్చేరి ఆంగ్లేయుల వశమైంది. అదే సమయంలో ఆలంపరై కోట కూడా ఆంగ్లేయుల ఆధీనంలోకి వచ్చింది. అయితే ఆంగ్లేయులు ఈ కోటను ఉపయోగించుకోవడానికి ఆసక్తి కనబరచలేదు. కోటను స్వాధీనం చేసుకున్న ఆంగ్లేయ పాలకులు దానిలో ఎక్కువ భాగాన్ని కూల్చివేశారు. కొన్నేళ్లపాటు ఆలంపరై కోటను వాణిజ్యస్థావరంగానే ఉపయోగించారు.



మొండిగోడగా మీటర్ మందంతో ఉన్న కోట ప్రహరీ - కోట లోపల మహమ్మదీయ సాధువును ఖననం చేసిన ప్రాంతం

కోట ఒడ్డునే మినీ ఓడరేవు...

ఆలంపరై కోటను 223 మీటర్ల పొడవు, 163 మీటర్ల వెడల్పుతో బంగాళాఖాతం తీరం ఒడ్డున ఇటుకలు, సున్నపురాయి మిశ్రమంతో నిర్మించారు. ఆ కోట ఉత్తరం వైపు పడవలలో సరుకులు తెచ్చుకునేందుకు వీలుగా కోటకు కందకంలా ఓ కాలువను కూడా తవ్వారు. తూర్పు వైపున సరుకులు లోడింగ్ అన్‌లోడింగ్ చేయడానికి వీలుగా చిన్న రేవును కూడా నిర్మించారు. 15 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ కోటలో 12 నిఘా బురుజులు ఉండేవి. కోట ప్రహరీ గోడలు ఒక మీటర్ మందాన్ని కలిగి ఉన్నాయి. ప్రస్తుతం నిఘా బురుజులలో ఒకటి రెండు బురుజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ కోటలోనే ఆర్కాట్ నవాబు కోసం ఓ టంకశాల కూడా ఉండేది. ఈ చోట ముద్రించిన బంగారు నాణేలను తమిళంలో 'ఆలంపరై వరాహన్' (వరహా) అని పిలిచేవారు. ఇక శిథిలస్థితిలో ఉన్న ఈ కోట నడుమ ఓ మహమ్మదీయ సాధువును ఖననం చేసిన ప్రాంతం కూడా ఉంది. 2004లో సంభవించిన సునామీ అలల తాకిడికి కోట గోడలు చాలావరకు కొట్టుకుపోయాయి. కూలిపడ్డాయి. ప్రస్తుతం కోట అంతర్భాగం పూర్తిగా మట్టికొట్టుకుపోయింది.

కోటలో పురావస్తు తవ్వకాలు...

ఈ కోటలో 2011 -2012 మధ్య రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ పురావస్తు తవ్వకాలు చేపట్టింది. ఆ తవ్వకాలలో ప్రాచీన కాలం నాటి ఇనుము, సీసం, రాగి వస్తువులు. గ్రానైట్ ఫిరంగి గుండ్లు, టెర్రాకోట దీపం, హుక్కా గొట్టాలు, చేతికడియాల గాజుముక్కలు, రాగి రేకులు, ఇనుపమేకులు, గాజుసీసాలు లభించాయి. అంతేకాక నాణేల తయారీ కోసం లోహాలను కరిగించేందుకు ఉపయోగించిన పైప్ ముక్కలు కూడా లభ్యమయ్యాయి. ఈ కోటలో లభించిన గ్రానైట్ గుండ్లు, సీసపు గుండ్లను బట్టి 18వ శతాబ్దంలో జరిగిన బ్రిటిష్ - ఫ్రెంచ్ యుద్ధంలో ఈ ఆలంపరై కోట కీలక పాత్రను పోషించినట్లు తెలుస్తోందని రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.శివానందం చెబుతున్నారు. పూర్వం ఈ కోట నుంచి లక్షలు విలువచేసే పట్టుపీతాంబర వస్త్రాలు, వజ్రవైఢూర్యాలు, కత్తులు, ఈటెలు, బాకులు వంటి ఆయుధాలు సహా ఎన్నో విలువైన వస్తువులు దేశవిదేశాలకు ఎగుమతి అవుతూ ఓ వైపు ఆర్కాట్ నవాబుల పాలనా కేంద్రంగా, మరోవైపు వాణిజ్య కేంద్రంగా కీర్తి గడించింది. నేడు ఆ చోట ఆ ఘనకీర్తికి సంబంధించిన ఆనవాళ్ల మాత్రమే మిగిలి ఉన్నాయి ప్రస్తుతం ఈ కోట నుండి ఎత్తుకెళ్లేందుకు ఏవీ లేవు ప్రశాంతత తప్ప! శతాబ్దాల తరబడి ఓ వెలుగు వెలిగిన ఆలంపరై కోట దైన్యస్థితిని చూస్తుంటే చరిత్రకారులకు, సామాన్యులకు 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు' అంటూ శ్రీశ్రీ కవిత గుర్తుకు రాక మానదు!

రాళ్లెత్తించిన రాజులెవరో?

ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా ఉన్నప్పటికీ ఈ కోటను ఎవరు నిర్మించారనే వివరాలు చరిత్రకారులకు ఇప్పటివరకూ లభించలేదు. మొఘలాయిల పరిపాలన తర్వాతే ఈ కోటను నిర్మించినట్లు రాష్ట్ర పురావస్తు శాఖ రికార్డులు చెబుతున్నాయి. అప్పట్లో కర్నాటక ప్రాంతాలను పర్యవేక్షించడానికి నియమితులయ్యే మొఘలాయిల ప్రతినిధులను (గవర్నర్లను) 'కర్ణాటక నవాబులు', 'ఆర్కాట్ నవాబులు' అని పిలిచేవారు. మొఘలాయిల్లో చిట్టచివరి నవాబుగా నియమితుడైన వ్యక్తి సదాతుల్లా ఖాన్. ఔరంగజేబు మృతి చెందిన కొన్నేళ్ళ తర్వాత ఈయన నియమితులయ్యారు. ఔరంగజేబు మృతి తర్వాత మొఘల్ సామ్రాజ్యం బలహీనమవుతూ వచ్చింది. దీనితో సదాతుల్లా ఖాన్ స్వీయనిర్ణయాలు తీసుకుంటూ స్వయంపాలకుడిగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాడు. సదాతుల్లాఖాన్‌కు పిల్లలు లేరు. దీనితో తన సోదరుడి కుమారుడు దోస్త్ అలీఖాన్‌ను తన వారసుడిగా నియమించాడు.

చిత్రలేఖనం, సంప్రదాయ గ్రంథాలపై ఆసక్తి పెంచుకోండి

● జెట్ చెన్నై అధ్యక్షులు రవీంద్రకుమార్‌రెడ్డి

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చిత్రలేఖనం, సంప్రదాయ గ్రంథాల పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) చెన్నై అధ్యక్షులు పి.రవీంద్రకుమార్‌రెడ్డి సూచించారు. త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి మంగళ శాసనాలతో 32వ వార్షిక రెండు రోజుల పోటీలు శనివారం స్థానిక అశోక్‌నగర్‌లోని జీఆర్‌టీ మహాలక్ష్మి పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. తొలిరోజు రామాయణంలోని శ్రీరామ పుష్పక విమానం, కుంభకర్ణుడిని నిద్రలేపే ఘట్టాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా, 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. యమునాచార్యుల ఆలవందార్ స్తోత్రం, నాలాయిర దివ్య ప్రబంధం, రామానుజ నూట్రాందాది, అవధానం పోటీల్లో సుమారు 1,200 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీసిటీ అధినేత రవి సన్నారెడ్డి సహకారంతో విజేతలకు ఆచార్య రత్నహారం జ్ఞాపిక ప్రశంసాపత్రం, పాల్గొన్న వారందరికీ ధ్రువీకరణ పత్రాలను రవీంద్రకుమార్‌రెడ్డి అందజేసి అభినందించారు. ఏర్పాట్లను జెట్ చెన్నై నిర్వాహక కమిటీ సభ్యులు పర్యవేక్షించి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. రెండో రోజైన ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు అష్టాహ, యతిరాజా వంశతి, హయగ్రీవ స్తోత్రం, విష్ణు సహస్రనామం, రామాయణంపై పోటీలు నిర్వహిస్తారు. ఈ రెండ్రోజుల పోటీల్లో గెలిచిన విజేతలకు ఈ నెల 17న టినగర్‌లోని పీఆర్‌సీ సెంటినరీ హాలులో బహుమతులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో రవీంద్రకుమార్‌రెడ్డి, జెట్ నిర్వాహకులు

శ్రీవారి సేవలో ప్రముఖులు



సుహాస్

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ హీరోలు ఆది, అశ్విన్‌బాబు, సుహాస్, సంగీత దర్శకుడు తమన్, డ్రమ్స్ శివమణి, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారులు ఎల్లా వెంకటేశ్వరరావు, తానా మాజీ అధ్యక్షుడు వీ సతీష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.



డ్రమ్స్ శివమణి, ఆది, అశ్విన్‌బాబు

స్వామిని దర్శించుకుంటే ధైర్యంగా ఉంటుందని వచ్చా

వచ్చేవారం నుంచి తాను తమిళంలో నటించబోతున్నానని, ఈ క్రమంలో స్వామిని దర్శించుకుంటే ధైర్యంగా ఉంటుందనే ఉద్దేశంతో తిరుమలకు వచ్చానని హీరో సుహాస్ తెలిపారు. దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారం రోజుల్లో తమిళ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు.

కోదండరాముడికి స్వర్ణ తులసీహారం బహూకరణ

తిరుపతి అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామికి శనివారం సాయంత్రం బెంగళూరుకు చెందిన దాత బంగారు తులసీహారం బహూకరించారు. రూ.26లక్షల విలువైన 257గ్రాముల పసిడితో తులసిదళాలు, వాటిపై గాయత్రి బీజాక్షరాలు పొందుపరిచారు. ఈ హారాన్ని దాత ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నకు అందజేశారు. విశేష ఉత్సవాలలో మూలవర్లకు దీన్ని అలంకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆనందకుమార్‌దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.



హారంతో డిప్యూటీ ఈవో నాగరత్న

సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.65 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,353

తలనీలాలు సమర్పించినవారు: 25,636



అధికారంలోకి వస్తే తూత్తుకుడిలో ట్రేడ్ సెంటర్

● ఈపీఎస్ హామీ



సభలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తూత్తుకుడిలో ట్రేడ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి హామీ ఇచ్చారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని ఎడప్పాడి పళనిస్వామి 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఆ రీతిలో శనివారం జిల్లా కేంద్రం తూత్తుకుడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప్పు ఉత్పత్తిదారులు, పడవల నిర్మాణ సంస్థల యజమానులు, కార్మికులు, మత్స్యకారులు, రైతులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సభలో ఈపీఎస్ మాట్లాడుతూ, అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తూత్తుకుడి విమానాశ్రయ విస్తరణ పనుల కోసం 250 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఆ స్థలంలో హైటెక్ వసతులతో పునరుద్ధరించిన విమానాశ్రయాన్ని ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని, దీని వల్ల తూత్తుకుడి మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకే మేనిఫెస్టోలో ప్రకటించిన 500 హామీల్లో 10 శాతం కూడా నెరవేర్చకుండా రాష్ట్రప్రజలను మోసం చేశారని, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రజాధనాన్ని దోచుకోవడంపైనే శ్రద్ధ చూపుతున్నారని వ్యాఖ్యానించారు. తూత్తుకుడి నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌రద్దీని దృష్టిలో ఉంచుకుని వీవీడీ సిగ్నల్ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించేందుకు అన్నాడీఎంకే ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని, అయితే న్యాయస్థానంలో కేసు దాఖలైనందు వల్ల ఈ పథకం మూలపడిందని, మళ్ళీ తాము అధికారంలోకి వస్తే ఈ పనులను పూర్తిచేయడంతో పాటు విదేశీ స్థాయి ట్రేడ్ సెంటర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గీత కార్మికులకు, ఉప్పు మళ్లలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నాణ్యమైన రోడ్లు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో మాజీమంత్రులు సెల్లూరు రాజు, ఓఎస్ మణియన్, కడంబూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ హాస్యనటుడు మదన్‌బాబ్ కన్నుమూత

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీ హాస్యనటుడు మదన్‌బాబ్ శనివారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన వయస్సు 71 సంవత్సరాలు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన మదన్‌బాబ్ సాయంత్రం ఐదు గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని అడయార్‌లోని నివాసగృహంలో సినీ ప్రముఖులు, నగరవాసుల సందర్శనకోసం ఉంచారు. మదన్‌బాబ్ అసలు పేరు ఎస్.కృష్ణమూర్తి. కే బాలచందర్ దర్శకత్వం వహించిన వానమే ఎల్లై చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయమయ్యారు. ఇప్పటిదాకా ఆయన సుమారు 130 సినిమాలకు పైగా నటించారు.



మదన్‌బాబ్ (ఫైల్‌ఫొటో)

గగనతలంలో విమాన ప్రయాణికుడికి గుండెపోటు

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విమానం గగనతలంలో ఉండగా ఓ ప్రయాణికుడికి గుండెపోటు రావటంతో ఆ విమానాన్ని ఎమెర్జెన్సీ ల్యాండింగ్ చేయించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శనివారం తెల్లవారుజామున 5.05 గంటలకు 170 మంది ప్రయాణికులతో ఇండిగో విమానం కోల్‌కతా నుంచి చెన్నైకు బయలుదేరింది. ఆ విమానం గగనతలంలో ఉండగా ఒక ప్రయాణికుడు గుండెపోటుకు గురికావడంతో విమాన సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. ఆ తర్వాత చెన్నై ఎయిర్‌పోర్టు కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేయగా, నిర్ణీత సమయం కంటే ముందుగానే విమానం ల్యాండ్ అయ్యేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అనుమతి ఇచ్చింది. విమానం ల్యాండ్ కాగానే రన్‌వేపై సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లోకి ఆ ప్రయాణికుడిని తరలించి చికిత్స అందించి, అక్కడ నుంచి ఆస్పత్రికి తరలించారు.

రామజయం హత్య కేసు

● ఖైదీ వద్ద డీఐజీ విచారణ

అడయార్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కుదిపేసిన తిరుచ్చికి చెందిన వ్యాపారవేత్త రామజయం హత్య కేసు దర్యాప్తులో భాగంగా పాలయంకోట జైలులో శిక్షను అనుభవిస్తున్న ఒక ఖైదీ వద్ద డీఐజీ వరుణ్ కుమార్ శనివారం విచారణ జరిపారు. రాష్ట్ర నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడైన రామజయం హత్య జరిగి 13 యేళ్లు పూర్తికావచ్చినా హత్య వెనుక దాగిన వాస్తవాలను గానీ, హంతకుల ఆచూకీని గానీ కనుగొనలేకున్నారు. ఈ నేపథ్యంలో ఈ హత్యకేసులో కీలక మలుపుగా జైలులో శిక్షను అనుభవిస్తున్న ఒక ఖైదీ వద్ద విచారణ జరపడం చర్చనీయాంశంగా మారింది. గత 2012లో రామజయం దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసులో నిందితులు ఎవరన్నది ఇప్పటివరకు గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో తిరుచ్చి సర్కిల్ డీఐజీ వరుణ్ కుమార్ పాలయంకోట జైలులో శిక్షా ఖైదీగా ఉన్న సుడలైముత్తు వద్ద మూడు గంటల పాటు విచారణ జరిపారు.

ఊటీ బొటానికల్ గార్డెన్‌లో ఎలుగుబంటి

● పర్యాటకుల భీతి

అడయార్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలోని బొటానికల్ గార్డెన్‌లోని రోజా పార్కులో ఒక ఎలుగుబంటి హల్‌చల్ చేస్తుంది. దీన్ని చూసిన పర్యాటకులతో పాటు స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బొటానికల్ గార్డెన్ అధికారులు కూడా ఆందోళన చెందుతూ, ఆ ఎలుగుబంటిని గుర్తించి, బంధించేందుకు చర్యలు చేపట్టారు. అదేసమయంలో స్థానికులు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పార్టీ దుస్థితికి వైగోనే కారణం!

● నిరాహారదీక్ష శిబిరంలో మల్లైసత్య ఆరోపణ

ప్యారీస్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మరుమలర్చి డీఎంకే (ఎండీఎంకే) దుస్థితికి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగోనే కారణమని, ఆ పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి మల్లైసత్య ఆరోపించారు. ఎండీఎంకేలో ప్రధాన కార్యదర్శి వైగో, మల్లైసత్యల మధ్య ఇటీవల కాలంగా చోటుచేసుకున్న భిన్నాభిప్రాయాలు అలాగే కొనసాగుతున్నాయి. తనకు ద్రోహం చేశారని మల్లైసత్యపై వైగో నిందమోపారు. దీనిని ఖండిస్తూ మల్లైసత్య తమ మద్దతుదారులతో శనివారం నగరంలో నిరాహారదీక్షలో పాల్గొన్నారు. పార్టీ జెండాలు, తోరణాలు లేకుండా ఏర్పాటు చేసిన ఈ దీక్షా శిబిరంలో రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 600 మందికి పైగా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు దీక్షను ప్రారంభించి మల్లైసత్య మాట్లాడుతూ, ఎండీఎంకేలో తన కుమారుడు ఎంపీ దురై వైగో రాకముందు పార్టీ అభివృద్ధి బాటలో ముందుకు నడిపించానని, కుమారుడు చేరిన అనంతరం పార్టీ సిద్ధాంతాలనే మార్పు చేశారని వ్యాఖ్యానించారు. పార్టీ అజెండా ప్రకారం జిల్లా కార్యదర్శులు, ఇతర నిర్వాహకులను నియమించే సంప్రదాయ అన్ని రాజకీయ పార్టీలు కొనసాగిస్తున్నాయని, అయితే ఒక్క ఎండీఎంకేలో మాత్రం దురై వైగో ఆధిపత్యం కొనసాగుతోందని, దీనిపై ప్రశ్నించినందువల్లే తనను వైగో ద్రోహి అని నిందమోపారని మల్లైసత్య తెలిపారు. ఈ దీక్షలో దక్షిణ చెన్నై జిల్లాకు చెందిన చెల్లపాండియన్, మూర్తి, పార్థిబన్, గౌరీకుమార్ సహా ఎండీఎంకే నేతలు పలువురు మల్లైసత్యకు మద్దతు తెలిపి పాల్గొన్నారు.



నిరాహార దీక్షా శిబిరంలో మద్దతుదారులతో పాల్గొన్న ఎండీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి మల్లైసత్య

పరువు హత్యలకు అదే కారణం

● ఎంపీ కమల్ హాసన్

అడయార్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే పరువు హత్యలు జరుగుతున్నాయని, దీనికి రాజకీయ పార్టీలు మాత్రమే కాదు సమాజ నిర్మాణం కూడా ఓ కారణమని సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ అభిప్రాయపడ్డారు. ఆయన శుక్రవారం రాత్రి ఢిల్లీ నుంచి చెన్నైకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఎయిర్‌పోర్టులో విలేకరులతో మాట్లాడుతూ, మనమంతా బయట ఉండి నిశితంగా ఇప్పటివరకు ఏదైతే చూస్తూ వచ్చామో దాన్ని ఇపుడు తాను సభలో ప్రత్యక్షంగా చూస్తున్నట్టు తెలిపారు. అందులో ఉండే గొప్పదనం, కర్తవ్యం అర్థమవుతుంది. ఇకపై తాను నిర్వర్తించాల్సిన కర్తవ్యం తెలుస్తోంది. అక్కడ తన బాధ్యతలను సక్రమంగా చేస్తాను. సభలో మాట్లాడబోయే విషయాలను ఇక్కడ వెల్లడించలేను. సభలో ప్రసంగించే సమయంలో వెల్లడిస్తానని తెలిపారు. ఇకపోతే, 'మనకు స్వాతంత్ర్యం రాకముందు నుంచి పరువు హత్యలు జరుగుతున్నాయన్నారు. దీనికి మూల కారణం పార్టీలు మాత్రమే కాదు సమాజ నిర్మాణం కూడా. ముందు దాన్ని మార్చాలి. అనేక పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి. కానీ, వీటన్నింటినీ దేశం దాటుకుంటూ వెళుతుంది' అన్నారు.

లోయలో బోల్తాపడిన కారు

- డ్రైవర్ మృతి

అడయార్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా కొల్లిమలై కొండ ప్రాంతంలో రెండో ఘాట్ రోడ్డు మలుపు వద్ద ఓ కారు అదుపు తప్పి 20 అడుగుల లోతులో ఉండే లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ ప్రాణాలు కోల్పోగా ఏడుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. కొల్లిమలై ప్రాంతానికి చెందిన జయకుమార్ (23) అనే వ్యక్తి సొంతంగా అద్దెకారు నడుపుతున్నారు. శనివారం సేందమంగళం ప్రభుత్వ కాలేజీలో విద్యాభ్యాసం చేస్తున్న దివాకర్, మణికంఠన్, లంకేశ్వరన్, మురుగన్, విశ్వనాథన్, కదిర్, కవిన్ అనే ఏడుగురు విద్యార్థులు కారులో కొల్లిమలై కొండ పర్యాటక అందాలను తిలకించేందుకు వెళ్ళారు. ఈ కారు రెండో ఘాట్ రోడ్డులో అదుపు తప్పి 20 అడుగుల లోయలో పడిపోయింది. డ్రైవర్ జయకుమార్ ఘటనాస్థలిలోనే ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిని స్థానిక పోలీసులు రక్షించి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

రికార్డుస్థాయిలో 45లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతుల నుంచి రికార్డు స్థాయిలో 45 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వాణిజ్య వస్తువుల వినియోగ సంస్థ తెలిపింది. రైతులకు తగిన గిట్టుబాటు ధర లభించేలా, భారత ఆహార సంస్థ ద్వారా వాణిజ్య వినియోగ వస్తువుల సంస్థ ధాన్యం కొనుగోలు చేపడుతోంది. ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి రేషన్ దుకాణాలకు అందిస్తున్నారు. రాష్ట్ర రైతుల నుంచి గత 2020-21వ సంవత్సరంలో అత్యధికంగా 44.90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ప్రస్తుత ధాన్యం కొనుగోలు సీజన్ 2024 సెప్టెంబరు 1న ప్రారంభమై ఈ నెలాఖరుతో ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా 3,758 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా, తొలిసారిగా 45.11 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. గత ఏడాది సీజన్‌లో 33.24 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుత సీజన్‌లో 11.87 లక్షల టన్నులు అధికంగా కొనుగోలు చేశారు. అందుకోసం, 5 లక్షల రైతుల బ్యాంక్ ఖాతాలో రూ.10,600 కోట్లు జమచేశారు. తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై, కరూర్, పుదుకోట, తిరుచ్చి, కడలూరు, పెరంబలూరు, అరియలూరు తదితర డెల్టా జిల్లాల్లో మాత్రమే 29.60 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. ఈ సీజన్ ఈ నెలాఖరు వరకు ఉండడంతో మరో 2 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశముందని అధికారులు తెలిపారు.

భక్తుల తలలపై టెంకాయలు కొట్టడంపై నిషేధం

అడయార్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కరూర్ జిల్లా కృష్ణరాయపురం తాలూకా మేట్టు మహాదానపురంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వార్షిక వేడుకల్లో భాగంగా భక్తుల తలలపై టెంకాయలు పగులగొట్టడాన్ని హిందూ దేవాదాయ శాఖ నిషేధం విధించింది. ఈ యేడాది ఆడిపెరుక్కు వేడుకల్లో భాగంగా, ఆదివారం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేస్తారు. అదేరోజు కావేరి నదిలో రాత్రి 8 గంటల సమయంలో అమ్మవారు తీర్థస్నానం చేస్తారు. మరుసటి రోజైన సోమవారం భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆ మొక్కుల్లో భాగంగా, పూజారులు భక్తుల తలపై టెంకాయలను పగులగొడతారు. ఈ మొక్కుబడిని దేవాదాయ శాఖ నిషేధించింది.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

వేలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం లత్తేరిలో అద్దె ఇంట్లో 35 గ్రాముల బంగారం, వెండి వస్తువులు, రూ.1.93 లక్షలు గత వారం చోరీకి గురయ్యాయి. ఈ విషయమై రాజస్థాన్‌కు చెందిన నెమిచంద్, కుటుంబ సభ్యులు, శనివారం ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. చోరీకి సంబంధించి ఇంటి యజమాని బాల, పోలీసులపై అనుమానం ఉన్నట్లు బాధిత కుటుంబ సభ్యులు లేఖలో పేర్కొన్నారు.



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

నాగై జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగల దాడి

● రూ.5లక్షల విలువైన వలలు, పరికరాల దోపిడీ

చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా కోడియక్కరై ప్రాంతం వద్ద చేపలవేట సాగిస్తున్న తమిళ జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగలు దాడి జరిపి, రూ.5లక్షల విలువైన వలలు, జీపీఎస్ పరికరాలు, సెల్‌ఫోన్లు, మత్స్య సంపదను దోచుకెళ్లారు. వేదారణ్యం సమీపంలో వెళ్ళపల్లమ్ గ్రామం నుండి మూడు మరపడవలలో 14 మంది జాలర్లు శుక్రవారం సముద్రంలో చేపలవేటకు వెళ్ళారు. శనివారం వేకువజామున వీరంతా కోడియక్కరైకి ఆగ్నేయంగా సముద్రంలో చేపలు పడుతుండగా నాలుగు పడవలలో వచ్చిన శ్రీలంక సముద్రపు దొంగలు చుట్టుముట్టి దాడి జరిపి, మూడు పడవలలో ఉన్న రూ.5లక్షల విలువైన చేపల వలలు, జీపీఎస్ పరికరాలు, సెల్‌ఫోన్లు, మత్స్య సంపదను దోచుకెళ్ళారు. సముద్రపు దొంగల దాడిలో సెల్వరాజ్, మూర్తి, ధనపాల్ అనే ముగ్గురు జాలర్లు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం ఉదయం వీరంతా తీరానికి చేరుకున్నారు. గాయపడిన ముగ్గురు జాలర్లను చికిత్స నిమిత్తం నాగపట్టినం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాహనాలను వెంటాడిన ఏనుగు

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆవేశంతో ఏనుగు వాహనాలను వెంటాడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. నీలగిరి జిల్లా ఊటీ సమీపంలో మసినకుడి - మాయర్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం యథావిధిగా వాహనాలు వెళ్తున్నాయి. ఆ సమయంలో, సమీపంలోని అడవి నుంచి రోడ్డు పైకి వచ్చిన ఏనుగు, అటుగా వచ్చిన జీపు, రెండు కార్లను అడ్డుకొనేందుకు యత్నించింది. డ్రైవర్లు సమయస్ఫూర్తిగా రివర్స్‌లో కారును నడిపారు. మరుమార్గంలో వచ్చిన జీపు డ్రైవర్ వేగంగా వెళ్లడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కొద్దిదూరం వాహనాలను వెంటాడిన ఏనుగు, సమీపంలోని అడవిలోకి వెళ్లిపోయింది.



వాహనాలను వెంటాడుతున్న ఏనుగు

రూ.176 కోట్లతో 7,924 గ్రామీణ గ్రంథాలయాల పునరుద్ధరణ

పెరంబూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్లలో 7,924 గ్రామీణ గ్రంథాలయాలను పునరుద్ధరించారు. రాష్ట్రంలో గత 2006-2011 డీఎంకే ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 12,618 గ్రంథాలయాలు ఏర్పాటుచేశారు. పదేళ్లుగా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో, గ్రంథాలయ భవనాలు దెబ్బతిన్నాయి. 2021లో అధికారం చేపట్టిన డీఎంకే, గ్రామీణ గ్రంథాలయాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, 2021- 22వ సంవత్సరంలో 4,116 గ్రంథాలయాలు, 2022-23లో 3,808, 2024-25లో 2,034 గ్రంథాలయాలను పునరుద్ధరించారు. దెబ్బతిన్న భవనాల స్థానంలో కొత్త భవనాలు, మౌలిక వసతుల కల్పన, దివ్యాంగులకు ప్రత్యేక వసతి, టాయిలెట్లు తదితరాలు ఏర్పాటుచేశారు. ఈ ప్రకారం, గ్రంథాలయాల పునరుద్ధరణకు రూ.55.71 కోట్లు, ఫర్నిచర్ కొనుగోలుకు ఒక్కో గ్రంథాలయానికి రూ.25 వేలు చొప్పున రూ.9.52 కోట్లు, కొత్త పుస్తకాల కొనుగోలుకు ఒక్కో గ్రంథాలయానికి రూ.50 వేలు చొప్పున రూ.19.04 కోట్లు కేటాయించారు. 2025-26వ ఆర్థిక సంవత్సరంలో 2,660 గ్రామీణ గ్రంథాలయాల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.



వేలూరు పెండలెంట్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ద్రవ వైద్య ఆక్సిజన్ సిలిండర్ ఏర్పాటుపనులను శనివారం పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, అధికారులు, ఆసుపత్రి నిర్వాహకులు

బళ్లారి రాఘవకు ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారుడు బళ్లారి రాఘవాచారికి డీఆర్వో నరసింహులు ఘన నివాళి అర్పించారు. రాఘవాచారి జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ రాఘవాచారి తెలుగు నాటక రంగానికి విశేష సేవలు అందించారని తెలిపారు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో జాతీయ పతకాలు

వడమాలపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట ఉన్నత పాఠశాల క్రీడాకారులు వెండి పతకాలు సాధించారు.జూలై 26 నుంచి 30వ తేదీ వరకు జాతీయ గ్రాప్లింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చేతన్ సాయి(9వ తరగతి) 50 కిలోల విభాగంలో, ప్రణతి(8వ తరగతి) 34 కిలోల విభాగంలో ప్రతిభ చూపి వెండి పతకాలను సాధించారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

సెప్టెంబరు 25 వరకు ప్రత్యేక రైళ్ల కొనసాగింపు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-విశాఖపట్నం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు సెప్టెంబరు 25వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో తెలిపారు. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ తగ్గకపోవడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైలు(08547) విశాఖపట్నంలో ప్రతి బుధవారమూ బయలుదేరుతుందని, ఈ ప్రత్యేక రైలు(08548) తిరుపతిలో ప్రతి గురువారమూ బయలుదేరి రాకపోకలు సాగిస్తుందని వివరించారు.

డ్యూటీలు వేయకుండా సబ్ రిజిస్ట్రార్ వేధిస్తున్నాడు

● అటెండర్ తిరుమలేష్ ఆరోపణ

రేణిగుంట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డ్యూటీలు వేయకుండా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ వేధిస్తున్నాడని ఆ కార్యాలయ అటెండర్ తిరుమలేష్ ఆరోపించారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతి విలేకరితో మాట్లాడుతూ కార్యాలయంలో తాను చేయాల్సిన పనులను ప్రైవేటు వ్యక్తుల చేత చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు రికార్డు రూమ్‌లోని బీరువా తెరిచి రికార్డులను పరిశీలిస్తుంటారని, డాక్యుమెంట్ నెంబర్లు రాస్తుంటారని తెలియజేశారు. తనకు తపాలా విధులు ఇచ్చి ప్రైవేటు వ్యక్తుల చేత ఎలా పనిచేయించారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డిని వివరణ కోరగా విధుల్లో భాగంగా అప్పగించిన పనులను సిబ్బంది చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే సిబ్బంది కొరతతో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకుంటున్నామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన సెల్వరాజ్

వరదయ్యపాళెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని పెద్దపాండూరు గ్రామానికి చెందిన సెల్వరాజ్ (22) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తుంటాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా నక్కలమిట్ట వద్ద అదుపుతప్పి బోల్తా పడ్డాడు. తీవ్ర గాయాల పాలైన అతడిని వెంటనే స్థానికులు సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

వడమాలపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాదిరేడు బైపాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మరో మహిళ తీవ్ర గాయాలపాలైంది. పాదిరేడుకు చెందిన వరదయ్య(65) వడమాలపాట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు బైపాస్ రోడ్డు దాటు తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న లారీ ఢీకొంది. వరదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న వసంతకు చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడింది. 108లో వారిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వరదయ్య మృతిచెందాడు. వడమాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు వరదయ్య

వెంగమాంబ బృందావనంలో ఘనంగా పుష్పాంజలి



తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 208వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో టీటీడీ అధికారులు శనివారం ఘనంగా పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా వెంగమాంబ వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంగమాంబ ప్రాజెక్ట్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

డీఐజీ గోపీనాథ్ జెట్టికి పితృవియోగం

● పలువురు నివాళి

ఓజిలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డీఐజీ గోపీనాథ్‌జెట్టి తండ్రి జెట్టి పుల్లయ్య (72) శుక్రవారం రాత్రి తిరుపతిలో మృతి చెందారు.ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఓజిలి మండలం కరబల్లవోలుకు శనివారం తీసుకువచ్చారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఓజిలి మండలం సగుటూరు ఎంపీటీసీగా పుల్లయ్య సేవలు అందించారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు ఐపీఎస్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం సందర్శించి నివాళులర్పించారు. కరబల్లవోలులోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.